

# అక్కడే ఆగక

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

"**నేను నాలుగేళ్ళ** క్రితం ఉక్రెయిన్‌లో రైల్లో ప్రయాణిస్తున్నాను. దారిలో నలుగురు కుర్రాళ్ళు ఎక్కారు. రాబోయేదే ఆఖరి స్టేషన్ కాబట్టి అప్పటికే పెట్టె ఖాళీ అయి, మేము తప్ప ఆ పెట్టెలో మరెవరూ లేరు. వాళ్ళు తాగి ఉన్నారు. వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకున్నది విన్నాను. చెయిన్ లాగుదామని ఒకడు సూచిస్తే మరొకడు ఐదు వందల రిఫ్నియాలు ఫైన్ కట్టాల్సివస్తుందని, వద్దని వారించాడు. ఎవరి దగ్గర ఎంత డబ్బుందో జేబుల్లోంచి తీసి లెక్కపెట్టారు. పన్నెండు వందలున్నాయి. వాళ్ళు చెయిన్ లాగారు. గార్డ్ వచ్చి ఎవరు లాగారని అడిగాడు. నావంక చూపించి నేనే లాగానని చెప్పారు. నేను లాగడానికి వాళ్ళు నలుగురు సాక్షులు. వాళ్ళే లాగారంటే నేను ఒక్కరే సాక్షిని. వాళ్ళు చెప్పింది అబద్ధమని, ఆ కుర్రాళ్ళు దొంగలని, నన్ను బెదిరించి నా జేబులోంచి పన్నెండు వందలు తీసుకుని పంచుకున్నారని, నా డబ్బుని పంచుకుని ఎవరి జేబుల్లో ఎంతెంత ఉంచుకున్నారో గార్డ్‌తో చెప్పాను. ఈలోగా పోలీసులు వెదికితే వారి జేబుల్లో నేను చెప్పినట్లుగానే డబ్బు కనిపించిమింది. తర్వాత స్టేషన్లో రైలాగాక వాళ్ళని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు."

"నో ఒన్ కెన్ బీట్ అలెక్సీ" గాడా బార్బ్రర్ నవ్వుతూ చెప్పింది.

"నువ్వు మర్యాదగా ప్రవర్తిస్తే ఇతరులు కూడా నిన్ను మర్యాదగా చూస్తారని అనుకోవడం, నువ్వు శాకాహారివి కాబట్టి సింహం నిన్ను తినదనుకోవడమే అని మాకో సామెత ఉంది" లివియూ హుతోషి చెప్పాడు.

"బేంకాక్‌లోని అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్‌లో చాక్లెట్లని, సిగరెట్లని కొన్నాను. డబ్బు చెల్లించాక కేషియర్ నా బేగ్‌లో ఓ కొలోన్ (సెంట్) సీసాని కూడా ఉంచాడు. అది ఉచితం అనుకున్నాను. కాని నేను షాప్‌లోంచి బయటకి రాగానే థాయ్ పోలీసులు నా బేగ్‌ని వెదికి, కొలోన్ సీసాని దొంగిలించానన్న నేరం మీద అరెస్ట్ చేసారు. రెండు రాత్రులు నన్ను ఎయిర్ కండిషన్డ్ సెల్‌లో ఉంచినందుకు ఐదువందల బాత్‌లని, నన్ను చూడటానికి వచ్చిన మనిషిని అనుమతించడానికి రెండువందల బాత్‌లని చెల్లించాను. పాకిస్థానీ ఎంబసీని ఎవరి ద్వారానో సంప్రదిస్తే వారు తమ నిస్సహాయతని తెలియచేసారు. నా మీద కోర్ట్‌లో కేస్‌ని ఫైల్ చేయకుండా వదలడానికి పోలీసులు పదకొండువేల బాత్‌లని లంచంగా అడిగాక నాకా స్కామ్ అర్థమైంది. ఇవ్వలేదు. నన్ను మెజిస్ట్రేట్ దగ్గరకి తీసుకువెళితే రెండువేల బాత్‌లని ఫైన్ వేసాడు. విమానంలోకి ఎక్కించాక పోలీసులు మిగతా ప్రయాణికుల ముందు నా సంకెళ్ళని తీసారు. కాబట్టి లంచాలు తీసుకునే ఏ

దేశం ఏర్‌పోర్ట్‌లలోని షాప్‌లలోనైనా కొన్నాక బిల్‌లోని ఐటెమ్స్ ని, సంచిలో వారు వేసిన వాటితో అక్కడే సరిచూసుకుని బయటకి రావాలి. ఉచితంగా ఇచ్చినవి బిల్ మీద రాయమని కోరాలి" సల్మాన్ చెప్పాడు.

"అనుభవమే ఎవరికైనా మంచి టీచర్. కాని ఆ టీచర్ జీతం మాత్రం చాలా ఖరీదైంది. ఈ మెయిల్‌టు ఎవ్విరివన్" క్రిస్ స్మిత్ వెంటనే సూచించాడు.

"చైత్రా. నీ వంతు" సల్మాన్ కోరాడు.

అంతా ఆమె వంక చూసారు.

"వెల్. నా మొదటి అమెరికా ప్రయాణానుభవం అతి కష్టమైంది. ఎం.ఎస్ చేయడానికి నేను అమెరికాకి బయల్దేరాను. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లో నా విమానం ఆలస్యమైంది. దాంతో పదమూడు గంటల నాన్ – స్టాప్ ఫ్లైట్‌లో చికాగోకి నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం ఐదున్నరకి చేరుకున్నాను. దాంతో లింకన్‌కి వెళ్ళే నా యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్‌ని మిస్సయ్యాను. ఇంకో ఫ్లైట్ ఆరు గంటల తర్వాతే. అదో గంటక్ గంట ఆలస్యం పెరుగుతూ చివరికి రద్దైందని మానిటర్లో ఊసాను. తర్వాతి ఇరవై నాలుగు గంటల్లో చికాగోనించి లింకన్‌కి వెళ్ళాల్సిన నేను ఏం చెయ్యాలని అడిగాను. ఆమె నా సామాను ఉందేమో చూసుకోమని కోరింది. నా రెండు సూట్ కేస్‌లని గుర్తుపట్టాను. ఆమె సూచన ప్రకారం టేక్సీ తీసుకుని బస్ స్టేషన్‌కి వెళ్ళి లింకన్‌కి వెళ్ళే బస్ ఎక్కాను. నా ఖర్మకొద్దీ నా గమ్యానికి చేరుకునే గంటముందు అది పాడైంది. రెండు గంటల తర్వాత మరో బస్ వచ్చింది. మర్నాడు రాత్రి పదకొండుకి లింకన్‌కి చేరుకున్నాను. అక్కడినించి యూనివర్సిటీలోని నా అపార్ట్ మెంట్‌కి టేక్సీలో చేరుకునేసరికి అది తాళం వేసుంది. నా రూమ్మేట్లు వీకెండ్‌కి పార్టీ చేసుకోడానికి వెళ్ళారు. వాళ్ళు వచ్చేసరికి నేను మా గదిముందు కారిడార్లో నా రెండు సూట్‌ల మీద నిద్రపోతూ కనిపించాను."

"దట్స్ టెరిబుల్" పెడ్రో చెప్పాడు.

ఇఫియాని చెప్పాడు.

"సల్మాన్ చెప్పింది విన్నాక నాకు బేంకాక్‌లో జరిగింది మరోటి గుర్తొచ్చింది. మొదటిసారి ఆఫీస్ పనిమీద నేను బేంకాక్‌కి వెళ్ళాను. హోటల్లో దిగాక క్రెడిట్ కార్డ్ ఇస్తే వివరాలు రాసుకుని తిరిగి ఇచ్చేసాడు. గదికి వెళ్ళిన కొద్ది నిమిషాలకి ఫోన్ మోగింది. 'హలో! రూం నంబర్ సెవెన్ ట్వంటీ? ఫ్రంట్ డెస్క్‌నించి. 'మిస్టర్ ఇఫియాని వాగ్‌బోగు. సారీ టు ఇన్‌కన్వీనియెన్స్ యు. కంప్యూటర్లో చెకిన్ చేసేప్పుడు మీ క్రెడిట్ కార్డ్ సమాచారంలో సమస్య వచ్చింది. తప్పు నంబర్లు రాసుకున్నట్లున్నాను. దయచేసి వాటినోసారి చెప్తారా?' అని అడిగాడు. అది చెప్పాక దాని వెనకాల ఉన్న మూడు డిజిట్లని కూడా చెప్పమని కోరాడు. ప్రయాణ బడలికలోని నేను ఆలోచించకుండా అదీ చెప్పాను. నిజానికి అదో స్కాం. ఆ ఫోన్‌కాల్ ఫ్రంట్ డెస్క్‌నించి రాలేదు. హోటల్ సిబ్బందితో కుమ్మక్కైన మరెవరినించో వచ్చింది. వాళ్ళు ఆ సమాచారంతో నా కార్డ్‌ని

ఉపయోగించి చాలా వస్తువులు కొన్నారు. బహుశ వాటిని తర్వాత సెకండ్ హేండ్ వస్తువులమ్మే షాప్‌లో అమ్మేసి ఉంటారు."

"ఇది కూడా మనం అందరికీ ఈమెయిల్ చేయాల్సిన సమాచారం" క్రిస్ స్మిత్ చెప్పాడు.

"ఆర్నెల్ల క్రితం మా నాన్న కార్ డ్రైవ్ చేస్తూంటే అకస్మాత్తుగా ఏం కనపడలేదు. టోటల్ విజన్ లాస్ట్. దాన్ని షోల్డర్‌లో ఆపడానికి సూచనలు ఇచ్చాను. తక్షణం నేను డ్రైవింగ్ సీట్లోకి మారి ఆయన్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను. రెటీనా డిటాచ్‌మెంటైందని చెప్పారు. ఆయన రెండు రోజులు హాస్పిటల్లో ఉన్నారు. అది ఇర్రివర్సబులని, కొన్నిజాగ్రత్తలు తీసుకుంటే అది పూర్తిగా డిటాచ్ కాకుండా ప్రొలాంగ్ చేయచ్చని డాక్టర్ సూచించారు. ఎండకి కళ్ళు ఎక్స్‌పోజ్ కాకుండా నల్ల కళ్ళజోడు వాడటం, గంటకోసారి కళ్ళు మూసుకోవడం, రాత్రి కూల్ పేక్‌ని కంటిమీద వేసుకోవడంలాంటివవి. నేను పక్కన లేకపోతే ఏమయ్యేదో అని తలచుకుంటే భయం వేస్తూంటుంది" ఏండ్రూ మిల్స్ చెప్పాడు.

మిగిలినవారికి హీనమైన ప్రయాణానుభావాలు లేవు. తర్వాతి కార్డ్‌లోని ప్రశ్న, 'మీకు బాధ కలిగినప్పుడు దాన్ని ఎలా వదిలించుకుంటారు?' సమాధానాలు.

"జూకి వెళ్ళి జంతువులని చూస్తాను."

"ఆహ్లాదకరమైన సంగీతం వింటాను."

"వీడియో గేమ్స్ ఆడతాను. పిల్లలు ఆడుకుంటూంటే చూస్తాను."

"బీచ్‌కి వెళ్ళి సముద్ర కెరటాలనే చూస్తూంటాను."

"మా అమ్మ దగ్గరకి వెళ్ళి భోరున ఏడుస్తాను" చెప్పి నలభై పై బడ్డ అలెక్సీ అందర్నీ నవ్వించాడు.

తర్వాతి ప్రశ్న 'ఫేవరెట్ బకెట్ లిస్ట్ ఏమిటి?' అంతా తలో జవాబు చెప్పారు.

"పేరా స్యూట్ జంప్"

"మాస్టర్ షెఫ్‌గా ఎన్నికవడం."

"ప్రయాణికుల విమానం కూలి నేనొక్కడినే జీవించడం."

"ఏనుగుమీద సవారీ."

"అమెరికన్ పౌరసత్వం."

"ఒక్కడినే పడవలో అట్లాంటిక్ ఓషన్‌లో యూరప్‌నించి నార్త్ అమెరికాకి చేరుకోవడం."

"అరెకరం అరటితోట, మరో అరెకరంలో మామిడి, జామ, సపోట, పనస, నారింజ, నిమ్మ మొక్కలు, కిచెన్ గార్డెన్ మధ్య ఆధునిక పరికరాలేం లేకుండా చిన్న పూరి గుడిసెలో నివాసం."

"పైన ఇల్లు. కింద నా స్వంత లైబ్రరీ. ఇంకేమీవ్యాపకాలు లేకపోవడం."

తర్వాత్ కార్డ్‌ని చైత్ర తీసింది.

"నువ్వు ఆఖరిసారి ఎప్పుడు ఏడిచావు? "

"పేరిస్ నించి ఇక్కడికి వచ్చేరోజు. విమానం గాల్లోకి లేచాక కింద కనపడే పేరిస్‌ని చూస్తూ, మళ్ళీ పేరిస్ చూస్తానో, చూడనోనని. తర్వాత జవాబుని, అలెక్సీ నువ్వు చెప్పు."

"యు మస్ట్ ఆన్సర్. నో పాస్ ప్లీజ్" గాడె కూడా గలగలా నవ్వుతూ చెప్పింది.

"క్రితం మేరేజ్ ఏనివర్సరీకి ఏడ్చాను."

తక్షణం నిశ్శబ్దం. అంతా అతని భార్య ఇలియా వంక చూసారు. ఆమె ప్రశ్నార్ధకంగా తన భర్త వంక చూసింది.

"మా పెళ్ళయ్యాక మొదటి ఏనివర్సరీకి ఇలియా చాక్లెట్ ముక్కని తుంపి నాతో పంచుకున్నప్పుడు అది సమానంగా తుంపలేదు. మరికాస్త పెద్ద ముక్కని తుంపి 'ఇది నీది' అని పధ్నాలుగేళ్ళ తర్వాత కూడా పెద్ద ముక్కని నాకిచ్చి చిన్న ముక్కని తను తీసుకున్నప్పుడు నా కళ్ళు చమర్చాయి" చెప్పాడు.

అంతా చప్పట్లు కొట్టారు.

"ఎంతటి సాధువైనా చాక్లెట్‌ని చూస్తే దొంగిలించకుండా ఉండలేరు. అది అంత మధురంగా ఉంటుంది. అలాంటిది తన వంతులోది కూడా ఇవ్వడం మెచ్చుకోదగ్గ విషయం" వెరా విబావా నవ్వుతూ చెప్పింది.

"ఇదా? ఇలియాకి ఇప్పుడు డైబెటీస్ కాబట్టి పెద్ద ముక్క ఇచ్చింది" అలెక్సీ మళ్ళీ చెప్పాడు.

అంతా పగలబడి నవ్వారు.

"నో. ఐ యాం జస్ట్ కిడ్డింగ్. మా ఇద్దరికీ డైబెటీస్ లేదు. కళ్ళల్లో నవ్వున్నప్పుడే పెదవుల మీది చిరునవ్వుకి విలువ పెరుగుతుంది.

"ఐ లవ్ యు ఇలియా" చెప్పి అలెక్సీ భార్యని చుంబించాడు.

మళ్ళీ అంతా చప్పట్లు కొట్టారు. అది చూసి ఆద్య సిగ్గుపడింది. ప్రేమ ఎలా ఉండాలన్నదానికి అది ప్రత్యక్షనిదర్శనం అనుకుంది.

"మనం కలిసే మనుషులు మనకి నచ్చకపోవచ్చు. కాని వాళ్ళు ఇచ్చిన చాక్లెట్ మాత్రం ఇంతదాకా నాకు నచ్చకుండా లేదు. సల్మాన్! నీ అనుభవం చెప్పు" అలెక్సీ అడిగాడు.

"ఇది లాస్ట్ ఇయర్ జరిగింది. మా చెల్లెలు ఉండేది అమెరికాలో. కాని పురిటికి పాకిస్తాన్‌కి రావల్పిండిలోని మా ఇంటికే వచ్చింది. దాని అత్తగారు పురిటికి తమ గ్రామానికే రమ్మని పట్టుబట్టడంతో అక్కడికి వెళ్ళక తప్పలేదు. నేనూ సాయం చేయాలని వెళ్ళాను. మర్నాడు పదిమైళ్ళ దూరంలోని పెద్ద ఊరులోని హాస్పిటల్లో చేరాలనుకుంది. కాని ఆ రాత్రే దానికి నొప్పులు ఆరంభమయ్యాయి. వెంటనే కారులో బయలుదేరాలనుకున్నాం. కాని డ్రైవర్ తన మిత్రుడి పెళ్ళికి

దాంట్లోనే వెళ్ళాడని తెలిసింది. ట్రాక్టర్‌లో బయలుదేరాం. రాత్రుళ్ళు పొలందున్నరుగా. దానికి హెడ్‌లైట్ల్ పని చేయడం లేదని గమనించలేదు. దాంతో టార్చ్ వెలిగించి నేను దారి చూపిస్తూ దాని ముందు నడుస్తూంటే, ఆ దారిలో నెమ్మదిగా ట్రాక్టర్ని తోలారు. మధ్యలో దాని టైర్ పంక్చరై కుంటినడకతో సాగింది. మాచెల్లెలి పురిటి నొప్పుల బాధ వర్ణనాతీతం. ఆ కుదుపులకి అక్కడే కానుపవచ్చని భయపడ్డాం. చివరికి ఎలాగో గవర్నమెంట్ హాస్పిటల్‌కి చేరుకున్నాం. అక్కడ డ్యూటీ డాక్టర్ లేడు. సెలవులో ఉన్నాడు. తను కాంపు చెయ్యలేనని, ప్రైవేట్ డాక్టర్ని తీసుకురమ్మని హెడ్ నర్స్ ఖండితంగా చెప్పింది. వెళ్ళి ఓ ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్ని లేపి రమ్మని కోరితే నిరాకరించాడు. తన హాస్పిటల్‌కే తీసుకురమ్మన్నాడు. ఆ మనిషి కదపలేని స్థితిలో ఉందని చెప్పినా వినిపించుకోలేదు. ఓ పట్టాన డెలివరీ అయి, సొమ్మసిల్లిన నా చెల్లెలు తర్వాత వరసగా ఇరవై నాలుగు గంటలు నిద్రపోయింది. ఇదంతా జరిగేప్పుడు నా చెల్లెలు చచ్చిపోతుందని భయపడి నేను ఎన్నిసార్లు ఏడ్చానో నాకే తెలీదు."

సల్మాన్ చెప్తూంటే ఆ నాటి భావోద్వేగాలని వాళ్ళు అతనిలో గమనించారు. అందరి మనసులూ భారమయ్యాయి.

"ఎనదర్ గేం ప్లీజ్. నో మోర్ టియర్ టేల్స్" ఇలియా భారంగా చెప్పింది.

"ఓకే. ఫై సెకండ్స్ గేం" ఒకరు సూచించారు.

అది మెదడు ఎంత చురుగ్గా పనిచేస్తోందో సూచించే గేం. ప్రశ్న విన్న ఐదు క్షణాల్లో జవాబు చెప్పాలి.

టోపీ ధరించే మూడు వృత్తుల వాళ్ళు ఎవరు? –పోలీస్, ఫైర్‌మేన్, సైనికుడు.

కరచాలనానికి మూడు ప్రత్యమ్నాయాలు? నమస్తే, సలాం. మూడోదిచెప్పలేకపోయారు. క్రిస్ కార్డ్ వెనక రాసిన జవాబు చెప్పాడు. ఫిస్ట్ బంప్.

చెంచాతో తినేమూడు? – సూప్, స్నాక్, పుడింగ్, ఐస్ క్రీం (నాలుగు చెప్పారు)

ట్రెషర్ ఛెస్ట్‌లో ఏం ఉంటాయి? బంగారం, కేష్, సేకరించిన ఓల్డ్ స్టాంప్స్, నాణాలు.

రబ్బర్ బేండ్ మూడు ఉపయోగాలు – కరెన్సీ బండిల్స్‌కి, జుట్టుకి, టై ఏ బేగ్.

ఎంగేజ్‌మెంట్ దాచే చెడ్డ ప్రదేశం – బాత్‌రూం, ట్రాష్ బేగ్, వాషింగ్ మెషీన్.

ఆద్యకి జవాబులు తట్టినా చురుగ్గా చెప్పలేకపోయింది.

తర్వాత డంబ్ షరాడే ఆడారు. తమ జట్టులోని ఒకరు నటించి చూపించింది నిమిషంలో కనుక్కోగలగాలి. గాలిపటాన్ని ఎగరేయడం, పిల్లో ఫైట్, బంగీ జంప్, పుస్తకం చదవడం, బర్డ్ వాచింగ్, యోగా క్లాస్, సినిమా చూడటం.

ఎక్స్‌ప్లోర్ అనేతర్వాతి ఆటలో ఫలానా అక్షరంతో ఆరంభమయ్యే ఒకటి చెప్పి, దానికి సంబంధించిన ఎవరికీ తెలీని సమాచారం చెప్పమని ఉంది. కార్డ్‌లో పండు, నగరం, దేశంలాంటి ఐటెమ్స్ ఉన్నాయి.

ఏ – పండు... ఏపిల్. ఏపిల్ తొక్కు తీస్తే ఏభై శాతం ఫైబర్ పోతుంది.

ఐ – దేశం... ఇజ్రాయిల్. అంధులకోసం ఇజ్రాయిలో కరెన్సీ మీద బ్రెయిలీ లిపిలో రాస్తారు.

ఎం – స్పేస్.. మూన్. చంద్రుడి వెడల్పుకన్నా ఆస్ట్రేలియా వెడల్పు ఎక్కువ.

"ఎన్ – ప్లేస్.. నార్త్ అమెరికా. ప్రపంచంలోని అతి పొడవైన సరిహద్దు కెనడా అమెరికాల మధ్యది.

"పి – లిక్విడ్.. పెట్రోల్, ఘానాలో ఆయిల్‌ని 1896లో కనుక్కున్నా, డ్రిల్లింగ్ మెషీన్స్ కనిపెట్టాక 1970ల నించే ఆఫ్ షోర్ ఏక్టివిటీ ఆరంభమంది.

బి – దేశం.. బల్గేరియా. తలని అటు ఇటు తిప్పితే ప్రపంచమంతా కాదని అర్థం. బల్గేరియాలో తలని అడ్డంగా అటూ ఇటూ తిప్పితే దానర్థం అవునని, పైనించి కిందకి తిప్పితే ఎస్ అని అర్థం.

కార్లోస్ అందరికోసం ఘానా వంట చేయడానికి ఓ వంటావిడని నియమించాడు. ఆవిడ వచ్చి వండుతూంటే ఆసక్తిగా చైత్ర, ఆమె వెంట ఆద్య వెళ్ళారు. రెడ్ రెడ్ స్ట్యూని ఎలా వండుతారో చైత్ర వీడియో తీసుకుంది.

"ఫ్రైడ్ రైస్‌కి, దీనికి గల తేడా ముందుగా ఉల్లిని వేయించి, తర్వాత దానికి నీరు, బియ్యం, రుచి కోసం కూరగాయలు, మిక్స్‌డ్ మీట్‌ని ఉడకపెడతారు. ఉల్లిని వేయించిన ఆయిల్ ఉండడంతో అన్నానికి ఆయిలీ ఫీలింగ్ వస్తుంది. దాన్ని మిరియాల పొడితే, ఫ్రైడ్ ఎగ్స్‌తో సర్వ చేస్తారు" వంటావిడ చెప్పింది.

రైస్ అండ్ బీన్స్‌తో చేసిన వాక్యీని టిండ్ సార్డెన్స్‌తో సర్వ్ చేసింది.

"స్ట్యూ, సూప్‌లకి తప్పనిసరిగా మేము టొమేటోలు, మిరియాలు, ఉల్లిపాయలు వాడతాము. దాంతో ఘానా ఆనియన్ సూప్, స్ట్యూ ఆరెంజ్ లేదా ఎరుపు రంగులో ఉంటాయి" ఆవిడ చెప్పింది.

"ఆఫ్రికాలో ఎక్కువగా పాం ఆయిల్‌ని వాడతారు. చాలామంది పిండితో చేసినదే తింటారు. ఉగాలి, గిమా, ఒబుసుమా, షిమ, పుటు, సద్జా గౌలి, జిమ, ఉబుగాలి, ఉమాత.. ఇలా ఒకోదేశంలో ఆ పిండికే ఓ పేరుంది. పుపు మేష్డ్ పొటాటో డిష్, ఫర్మెంటెడ్ కార్న్ పిండిని బంక్ అంటారు. ఫర్మెంటెడ్ కార్న్, కసావా దుంప కలిపి రుబ్బిన పిండిని కెన్క అంటారు" చైత్ర చెల్లెలికి వివరించింది.

భోజనం చేస్తూ కార్డ్‌లలో వచ్చిన మరికొన్ని ప్రశ్నలు ఇంట్లో చేసే పనుల్లో ఏ పని నీకు ఇష్టం ఉండదు? నీ ఫేవరేట్ హాలీడే జ్ఞాపకం ఏమిటి? మొదలైన వాటికి జవాబులు చెప్పారు. భోజనం అయ్యాక క్రిస్ అడిగాడు.

"అలెక్సీ! నువ్వు మళ్ళీ కొత్త రెండు వాక్యాల కథలు చెప్తావా?"

"ఈబంగారు ప్రశ్న కోసమే వేచి ఉన్నాను మిత్రమా! కాచుకోండి. చప్పట్లు కొట్టడంలో బద్ధకం ఒద్దు."

అతను చెప్పసాగాడు.

"ఇంటి పెరడులోంచి ఎగిరే విమానాన్ని చూసిన ఒకడు తను ఆ విమానంలో ఉంటే బావుండును అనుకున్నాడు.

పై నించి ఆ ఇంటిని చూసిన పైలట్ తను ఇంట్లో ఉంటే బావుండును అనుకున్నాడు."

"దీన్నే మేము పొరుగింటి పుల్లకూర రుచి అంటాం" ఆద్య నవ్వుతూ చెప్పింది.

చైత్ర ఆ సామెతని వివరించింది.

"సూర్యచంద్రులు ఒకరినొకరు వెంటాడుతూ దాదాపుగా మిస్సవుతూంటారు.

కాని అరుదుగా వారు కలుసుకుని ముద్దు పెట్టుకుంటూంటే, ప్రపంచానికి గ్రహణం పడుతుంది."

"భావుకత. ఈ భావుకత నాకు నచ్చింది" ఆద్య చెప్పింది.

"భావుకత హృదయానికి సంబంధించింది. ఆచరణ మెదడుకి సంబంధించింది. ఈ విషయంలో హృదయం గెలిస్తే దుఃఖం, మెదడు గెలిస్తే ఆనందం."

ఇంకో కప్‌లెట్ చెప్పాడు.

"అద్దం ముందున్న ఆమె కేప్సికంలా ఉంది.

అద్దంలోని తన ప్రతిబింబం పచ్చి మిరపకాయలా ఉండాలని ఆమె కోరుకుంటోంది."

"ఇది కొత్తగా మా చెల్లలు మీద రాసావు" చైత్ర బుంగమూతి పెట్టి చెప్పింది.

"బాల్యంలో తల్లి తండ్రులనించి డబ్బు పొందడం విజయం. పెద్దయ్యాక కూడా అదే పని కొనసాగించడం అపజయం."

"జీవిత సత్యం" క్రిస్టీనా చెప్పింది.

"నన్ను చూస్తే భయంలేదా?" పులి ఆ అందమైన టీనేజర్ని అడిగింది.

"మీ జాతి జీవులకన్నా మా జాతివారంటే నాకు భయం" ఆమె జవాబు చెప్పింది.

"మరో జీవిత సత్యం."

"తల్లి తండ్రులు తిడతారని చిన్నప్పుడు వాడు దొంగేడుపు లంకించుకునేవాడు. వాడు పెద్దయ్యాక ఎందుకని అడుగుతాడని తల్లితండ్రులు రహస్యంగా ఏడుస్తున్నారు."

"టచీ!"

"నడిచే దారిలో జాగ్రత్త" తండ్రి కొడుకుని హెచ్చరించాడు.

"నువ్వే జాగ్రత్త నాన్నా! నేను నీ అడుగుజాడల్లో నడుస్తున్నాను" కొడుకు జవాబు చెప్పాడు."

"వెరీ నైస్" ఏండ్రూ చెప్పాడు.

"ఈ రోజు నేనో గులాబీని చూసాను.

స్కూల్‌కి వెళ్ళే వయసున్న ఆ గులాబీ ట్రాఫిక్ లైట్స్ దగ్గర గులాబీలని అమ్ముతోంది.

"పేథటిక్ బట్ ట్రూ."

"మధ్యకి విరిగిన పెన్సిల్‌ని రెండువైపులా చెక్కి వాడుకున్నాడు.

పెద్దయ్యాక జీవితంలో అనుకోనిది ఏది జరిగినా వాడు దాన్ని అవకాశంగా మార్చుకుంటున్నాడు."

"హియర్. హియర్" జై బై వూ చెప్పాడు.

భోజనమయ్యాక కార్లోస్ బయట వేచి  వున్న డ్రైవర్లకి మిగిలిన భోజనాన్ని ఇంటికి తీసుకెళ్ళమని ఇచ్చేసాడు.

"ఇప్పుడు డిహైడ్రేషన్ గేం ఆడదాం" కార్లోస్ నోట్లోంచి ఆ మాటలు మత్తుగా వచ్చాయి.

"అదేం ఆట?" ఆద్య అక్కని అడిగింది.

"ఆల్కహాల్ ప్రభావం తగ్గడానికి చివర్లో ఈ ఆట ఆడతాం. ఏదైనా ప్రశ్నకి సరైన జవాబు చెప్పాక కొంచెం మంచినీళ్ళు తాగాలి. దాంతో దిగుతుంది. మంచినీళ్ళ గ్లాస్ ఖాళీ అయ్యేదాకా ఒక్కో గుక్క తాగాలి. గ్లాస్ ఖాళీ అయ్యాక ఎప్పుడైనా ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఇంటికి ఫ్రెష్‌గా వెళ్ళచ్చని" చైత్ర చెల్లెలికి వివరించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com

www.telugubooks.in

Post your comments